క్లుప్తంగా

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆకాంక్షించారు. ఆమె మాట్లాడుతూ.. మనకు కొత్త సంవత్సరంలో పండుగలు ఉగాది నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉగాది పచ్చడిలా ప్రజల జీవితాల్లో షడ్రుచులు ఉండాలని, కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

సుస్థిర సవాళ్లపై అవగాహన

నర్సాపూర్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశంపై తమ కాలేజీ తరపున అవగాహన కల్పించినట్లు బీవీ ఆర్ఐటీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ శ్రావణి సమీరా అన్నారు. విద్యార్థులకు వాతావరణ కాలుష్యం, నీరు, విద్య, పారిశుద్ధ్య అంశాలపై తమ కాలేజీకి చెందిన కెమికల్ ఇంజనీరింగు విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సుస్థిరత సవాళ్ల గురించి అవగాహన కల్పించామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు అందజేశామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విఠల్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్: మండలంలోని సీతారాంపూర్‌లోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించే కల్యాణోత్సవం వాల్‌పోస్టర్‌ను హనుమాన్ ఆలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దాతలు నరేశ్‌యాదవ్, బుచ్చేష్‌యాదవ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైతులు పశువుల షెడ్డులను నిర్మించుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు తమ పంట పొలాలు, ఇతర ఖాళీ స్థలాల వద్ద పశువుల షెడ్డులను నిర్మించుకోవాలని ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఉపాధిహామీ నిధులతో రైతులు నిర్మించుకొన్న పశువుల షెడ్డును పరిశీలించారు. రైతులకు ఈజీఎస్ ఆధ్వర్యంలో పశువుల పాకలు, ఇతర వ్యవసాయ అనుబంధ అవసరాలకు నిధులు కేటాయిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ మోహన్, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింలు తదితరులున్నారు.

వైన్స్ షాపులో దొంగతనం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం శివారులోని కనకదుర్గ వైన్స్‌లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి కనకదుర్గ వైన్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, షెటర్ తాళాలు పగులగొట్టి నగదుతో పాటు మందు సీసాలను దొంగిలించారు. వైన్స్ తాళాలు పగులగొట్టిన విషయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించగా సుమారు రూ.ఐదు వేల నగదు, 20 మద్యం సీసాలు దొంగతనం చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

చట్టాలపై అవగాహన



హవేళిఘణాపూర్(మెదక్): మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న నాగమణి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లిలో మహిళల చట్టాలు, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు నాగమణి మాట్లాడుతూ.. గ్రామాల్లో వరకట్నం, లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజల్లో వీటిపై అవగాహన కల్పించాలని, ప్రతీ మహిళ తన హక్కులను గుర్తించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సీడీపీవో రమా, లావణ్య, సౌందర్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి మూడు రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

వైభవంగా బర్మాస్వామి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల గ్రామంలో కొలువైన బర్మాస్వామి ఉత్సవాలు ఉగాది రోజు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. వందల ఏళ్లనాటి చరిత్ర కల్గిన ఆలయానికి ప్రత్యేకత ఉంది. బర్మాస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి గిరిజన భక్తులు ఒకరోజు ముందుగానే చేరుకొని వంటవార్పు చేసుకుంటారు. ఉగాది రోజున బర్మాస్వామికి ప్రత్యేక పూజలతో పాటు రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

ఎడ్ల బండ్ల ఊరేగింపు

చిన్నశంకరంపేట(మెదక్): తెలుగు సంవత్సరాది ఉగాది రోజున మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద గ్రామస్తులు ఎడ్ల బండ్లను తిప్పి మొక్కులు చెల్లిస్తారు. అలాగే రెండో రోజు దుర్గామాత ఆలయం వద్ద మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు. అలాగే మండలంలోని గజగట్లపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామస్తుల ఎడ్లబండ్లను తిప్పుతారు. రెమండలంలోని ఖాజాపూర్‌లో దుర్గమాత ఆలయం వద్ద బండ్లు, బోనాలు ఊరేగించి ఉత్సవాలు చేస్తారు.



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్లలో రథాలు

వెల్మకన్నెలో జాతర ప్రత్యేకం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీరాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉగాది పండుగ సందర్భంగా నాలుగు రోజులపాటు జాతర జరుగుతుంది. ఉగాది పండుగ రోజు గ్రామస్తులంతా బాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్లతో అందుగులపల్లి అడవిలోని పచ్చగుట్టపైన ఉన్న శ్రీరాయిగిరి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగించి అయ్యారిగూడెంలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి మిత్తల్ అయ్యారి వంశస్తులు పూజలు చేస్తున్నారు.



చిన్నశంకరంపేటలోని దుర్గామాత ఆలయం



కౌడిపల్లి(నర్సాపూర్): వేంకటేశ్వరస్వామి ఆలయం

బగలాముఖీ శక్తిపీఠంలో విశేష పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని బగలాముఖీ శక్తిపీఠంలో శనివారం అమావాస్య సందర్భంగా బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, పైసం యాదగిరి, నర్సింలు, వెంకటేష్, నాగరాజు, రమేశ్ గుప్తా ఏర్పాట్లు చేశారు. హైదరాబాదుకు చెందిన వడ్డేపల్లి మానస భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కమలేష్, తదితరులు ఉన్నారు.



మహామంత్ర హోమం నిర్వహిస్తున్న వేద పండితుడు

బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని బూరుగడ్డకు చెందిన వెంకటేశం రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాలు తొలగించారు. అతనికి బీఆర్ఎస్‌పార్టీ సభ్యత్వం ఉండటంతో ఇన్సూరెన్స్ డబ్బులు రూ. 1లక్ష మంజూరయ్యాయి. దీంతో చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం బాధితుడికి అందజేశారు. దీంతో పాటు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రవన్‌కు రూ. 30వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఎంపీపీ రాజునాయక్, మండల మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు ఎల్లం, మహిపాల్‌రెడ్డి, అమర్ సింగ్, నాయకులు ప్రతాప్‌గౌడ్, నవీన్, నర్సింలు, నరహరి, సందీప్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని ఈద్గా (నమోజ్ గడ్డ) వద్ద 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, మౌలానా, లాయక్ అలీ, భిక్షపతి, సత్యంగౌడ్, భోగ శేఖర్, రామచందర్, ఆంజనేయులుగౌడ్, మోహిజ్, షకీల్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు అభివృద్ధి చెందాలి



పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు

సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాములు

నర్సాపూర్ రూరల్: పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల జయరాములు పిలుపునిచ్చారు. శనివారం నర్సాపూర్ పట్టణ పద్మశాలి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఏకతాటిపై ఉండాలన్నారు. నర్సాపూర్ పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడిగా పొన్న జయప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా బొమ్మిడాల పద్మనాభం, పాముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పాముల నాగరాజు, సహాయ కార్యదర్శిగా జగదీశ్వర్, కోశాధికారిగా తాటి నర్సింలు, ప్రచార కార్యదర్శిగా గడ్డం కృష్ణ, లీగల్ అడ్వైజర్‌గా కంది ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా కంది అర్జున్, సలహాదారుగా ముత్యాల వీరేశం, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా పాముల యాదమ్మ, యువజన సంఘం అధ్యక్షుడిగా హరే రామ్, ఉపాధ్యక్షుడిగా ఓం ప్రకాష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు అభినందనీయం

ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. తూప్రాన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉత్తమ సేవా పురస్కార అవార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైనికులు దేశం కోసం సేవ చేస్తే.. పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కార అవార్డు అందజేయడం గర్వించదగిన విషయం ప్రెస్‌క్లబ్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, కమిషనర్ గణేశ్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జూనియర్ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పరీక్షా కేంద్రం వద్ద ఎస్సెస్సీ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించడంతో పాటు అర్హత కలిగిన అధ్యాపక బృందాలు విద్యార్థులకు బోధిస్తున్న తీరును వారికి వివరించి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బస్వరాజ్, మౌనిక, సౌజన్య, లక్ష్మర్‌కోబి, సిబ్బంది అశోక్ తదితరులున్నారు.

ఇంటిని కూల్చడం సరికాదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): యాభై ఏళ్లుగా ఉంటున్న తన స్థలంలో నిర్మించుకున్న రేకుల షెడ్డును, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ సిబ్బంది కూల్చివేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ దుర్గాదాస్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని చండూర్ గ్రామంలో సర్వే నంబర్-2 లో మాసపేట యేసయ్య అనే వ్యక్తి 50 ఏళ్ల నుంచి ఉంటున్న ఇంటి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న పాత బేస్‌మెంట్ పైనే రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. ఈ విషయమై రెవెన్యూ సిబ్బంది ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, పోలీసులు సహాయంతో షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేశారు. దళితుడైన వ్యక్తి పై కక్షపూరితంగా, వ్యవహరించి అతని ఇంటిని కూల్చి వేసిన అధికారులు తిరిగి కూల్చేసిన షెడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాద్, మొగులయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వెంకటేశ్వరశర్మకు ఉగాది విశిష్ట పురస్కారం



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రానికి చెందిన వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ప్రభుత్వం అందించే ఉగాది విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు.

మనోహరాబాద్ ఎంపీఓగా శ్రీనివాస్‌రెడ్డి



మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ ఎంపీఓగా శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం నుంచి మనోహరాబాద్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పని చేసిన లక్ష్మీనర్సయ్య అక్కడికి బదిలీపై వెళ్లారు.

రాజీవ్ యువ వికాసం పత్రాలు అందజేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధించి పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వివిధ పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలు సమర్పించాలని, అందుకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ సభ్యుడిగా మల్లారెడ్డి



మల్లారెడ్డికి స్వీటు తినిపిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్(మెదక్): రాష్ట్ర రోడ్డు రవాణా అథారిటీ జిల్లా సభ్యుడిగా మండలంలోని కోరంపల్లికి చెందిన మల్లారెడ్డిని నియమిస్తూ శనివారం మంత్రి దామోదర రాజనర్సింహ నియామకపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తనను ఎంపిక చేసిన మంత్రులు దామోదర, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలపై అవగాహన



వాల్ పోస్టర్ల ద్వారా మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డా.దామోదర్

నర్సాపూర్ రూరల్: యువత బాగుంటేనే దేశం బాగుంటుందని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ అన్నారు. శనివారం మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిసలు అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకుంటున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్లతో సమయం వృథా చేసుకుంటూ లక్ష్యాలకు దూరమవుతున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సమీరా, అధ్యాపకులు రమేశ్, రుక్మిణి దేవి, హేమంత్, మహేందర్‌రెడ్డి, రాము పోచయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేయడం అలవర్చుకోవాలి

నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్

నర్సాపూర్ రూరల్: ప్రతీ ఒక్కరు సేవ చేయడం అలవర్చుకోవాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ విద్యార్థులకు సూచించారు. శనివారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ శిబిరం యూనిట్-1 విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిపల్లిలో నిర్వహించిన ఏడు రోజుల వేసవి శిబిరం ముగింపులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవ చేయడం అలవర్చుకుంటే జీవితంలో అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. యువత అవసరమైన విషయాలపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల ఆశయాలను చేరుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ శిబిరాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ప్రో గ్రాం అధికారి సురేష్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, రమేశ్, హేమంత్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉండాలి

జిల్లా వ్యాప్తంగా శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, తహసీల్దార్లు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. రెండు గ్లాసుల పద్ధతిపై అవగాహన కల్పించారు. ప్రతీ పర్వదినాన్ని అందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు.



అల్లాదుర్గం(మెదక్): బహిరన్‌దిబ్బలో మాట్లాడుతున్న అధికారులు



పెద్దశంకరంపేట(మెదక్): బూర్గుపల్లిలో..



టేక్మాల్(మెదక్): హెచ్‌ఎంపల్లిలో ..

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలలో ఉగాది వేడుకలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉగాది సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పుష్పవేణి, హెచ్ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు స్వప్న ఉన్నారు.

◆ పౌష్టికాహారం కిట్స్ పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): క్షయవ్యాధి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న నిక్షయ్ పోషక్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు కోరారు. శనివారం పీహెచ్‌సీలో బియ్యం, కందిపప్పు, పెసర, ఎర్రపప్పు, పల్లీలు, మంచినూనెతో కూడిన నిక్షయ్ పోషక్ కిట్స్‌ను అందించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ ఆఫీసర్ నిర్మల, సీహెచ్ఓ యాదగిరిరావు, ఎన్ఎంలు వనిత, కుమారి, నర్సింహులు పాల్గొన్నారు.

◆ నవోదయకు ఎంపికైన విద్యార్థి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వేదాన్ష్‌రెడ్డి నవోదయ పాఠశాలలో చదువుకునేందుకు ఎంపికయ్యాడు. మండలంలోని శభాష్‌పల్లి సత్యం విద్యాలయంలో 5వ తరగతి చదువుతున్న వేదాన్ష్‌రెడ్డి నవోదయ ప్రవేశ పరీక్ష రాయగా అర్హత సాధించాడు. దీంతో విద్యార్థిని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

◆ పీహెచ్‌సీకి సామగ్రి వితరణ

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పలు సామగ్రిని ఐటీసీ పరిశ్రమ వాళ్లు శనివారం అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్నదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో బీపీ ఆపరేటర్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్, డెలివరీ గదిలో ఏసీ, రిఫ్రిజిరేటర్లు రెండు, టేబుల్స్, ఫైర్ సేఫ్టీ వస్తువులు, పిల్లర్ స్టాండ్, హైజీన్ ట్రాలీలను అందజేశారన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సీఎస్ఓ బాల్‌నర్సయ్య, సిబ్బందితో కలిసి పరిశ్రమ ప్రతినిధులను సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ కాళ్లకల్‌లో తైబజార్ వేలం వాయిదా

మనోహరాబాద్(తూప్రాన్): అధికారులు నిర్వహించిన కాళ్లకల్ తైబజార్ వేలానికి నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని కాళ్లకల్ గ్రామ పంచాయతీ వద్ద తైబజార్ వేలం నిర్వహించగా, కనీస ధర రాకపోవడంతో బుధవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, మాజీ సర్పంచ్ మల్లేశ్, గ్రామ నాయకులు వెంకటేశంగుప్తా, నర్సింహ్మ, వెంకటేష్, శ్రీశైలం, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

◆ డంప్‌యార్డు ఎత్తి వేయాలి

నర్సాపూర్: నర్సాపూర్ చెరువు, అడవులను కలుషితం చేసే డంప్‌యార్డును ఎత్తి వేయాలని స్థానిక శివాలయం అర్చకుడు వీరప్ప గురుస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 39వ రోజుకు చేరాయి. శనివారం దీక్షలో వీర శైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొని నిరసన తెలిపారు. దీక్షలో జేఏసీ నాయకులు రాజేందర్, సుబ్రమణ్యం, శ్రీశైలం, బసప్ప, సంగమేశ్వర్, వినోద్, భద్రప్ప, రామప్ప, గంగాధర్, ఆనంద్, చంద్రశేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ సగర టేక్మాల్ మండలాధ్యక్షుడిగా నవీన్

టేక్మాల్(మెదక్): ఉప్పర సగర సంఘం టేక్మాల్ మండలాధ్యక్షుడిగా ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఉప్పర సగర జిల్లా అధ్యక్షుడు సందిల సాయిలు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో మండల అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సాయిలు, కోశాధికారిగా సుధాకర్, కార్యదర్శిగా ఉప్పరి రాములు, ప్రచార కార్యదర్శిగా ఉప్పరి శివచందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షులు సన్మానించారు.

◆ చలివేంద్రాలు ప్రారంభం

టేక్మాల్(మెదక్): వాహనదారులు, ప్రయాణికులు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విఠల్ తెలిపారు. శనివారం మండలంలోని ఎల్లంపల్లి పంచాయతీ కార్యదర్శి సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వీటి నిర్వహణ క్షేత్రస్థాయి అధికారులదేనన్నారు. టేక్మాల్‌లో ఈఓ రాకేశ్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు.

బస్టాండ్ ప్రాంగణంలో..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి బస్టాండ్ వద్ద హనుమాన్ ఆలయం ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నగేశ్, గ్రామస్తులు ఆంజనేయులు, పాషా, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్సపొందుతూ మహిళ మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్ఐ నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి మండలంలోని చిట్కుల్ శివారులో రోడ్డు ప్రమాదంలో కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ మండలంలోని బంజారానగర్ తండాకు చెందిన సలాబత్ అంసీ(35)ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. భర్త సలాబత్ లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

◆ పరీక్షల వేళ కరెంట్ కోతలు

నర్సాపూర్: పదోతరగతి పరీక్షల వేళ పట్టణంలో కరెంట్ సరఫరాలో అంతరాయంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున కరెంట్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడడంతో విద్యార్థులు సరిగా చదవలేకపోతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని నాల్గవ వార్డులో తాగునీరు నల్లాల ద్వారా సరిగా రావడం లేదని వార్డు ప్రజలు ఆరోపించారు. వారు మాట్లాడుతూ.. నల్లాల ద్వారా ఇంటికి ఐదు, ఆరు బిందెల నీళ్లు వస్తున్నాయని, అవి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.